www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 9 సెప్టెంబర్ 2024

5

తిరుపతి



ఎమ్మెల్యేచే పెట్రోల్ బంకు ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి- పిచ్చాటూరు ప్రధాన రోడ్డు మార్గంలో కొత్తకండ్రిగ గ్రామం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదివారం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును ప్రారంభించారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా వినియోగదారులకు అందించాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టిడిపి తొట్టంబేడు మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు పాల్గొన్నారు.

రోడ్డును ముంచేసిన మురుగు

- చెరువును తలపిస్తున్న రేణిగుంట రోడ్డు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- వెదజల్లుతున్న దుర్గంధం
- కార్పొరేషన్ లీలలకు మరో మచ్చుతునక

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అది చెరువు కాదు సుమా... అలాగని డ్రైనేజీ కుంట కూడా కాదు.. నిత్యం లక్షలాది మంది తిరుగాడే రాష్ట్ర రహదారి. తిరుపతి- రేణిగుంటకు ప్రధాన మార్గం. ఉన్నతాధికారులు ఆ మార్గంలో పయనిస్తూనే ఉంటారు. కానీ రోడ్డును పూర్తిగా ముంచేసిన డ్రైనేజీని తొలగించేందుకు పూనుకుంటే ఒట్టు. స్థానికులు.. వాహనదారులు, పాదాచారులు అనేక సార్లు అధికార్లకు మొరపెట్టుకున్నా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం గమనార్హం.

రోడ్డుపై నిల్వ చేరిన మురుగునీరు

తిరుమల శ్రీవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, యాత్రికులు ఎక్కువుగా జంక్షన్ ప్రాంతమైన రేణిగుంట రైల్వేస్టేషన్‌కు వస్తుంటారు. అక్కడ నుంచి వివిధ వాహనాల ద్వారా తిరుపతిలోకి ప్రవేశిస్తారు. తిరుపతిలోకి ప్రవేశించే ముందే డ్రైనేజీ నీరు వారికి స్వాగతం పలుకుతుంది. తిరుపతి- రేణిగుంట ప్రధాన మార్గంలోని పూలవాని గుంటకు వెళ్లే సర్కిల్ వద్ద డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ఆ ప్రాంతంలోని ప్రధాని రహదారి మొత్త మురికినీటితో నిండిపోతోంది. రోడ్డుపై సుమారు 2 అడుగుల ఎత్తు వరకు మురుగునీరు ప్రవహిస్తుండడంతో అటుగా వెళ్లే వాహనదారులకు, పాదాచారులకు అవస్థలు తప్పడం లేదు. పైగా ఆ చుట్టుపక్కల పలు ప్రముఖ కంపెనీల బ్రాంచీలు, వ్యాపార సముదాయాలు, కార్పొరేషన్ ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన, క్రీడా సముదాయం, నివాస గృహాలు ఉండడంతో డ్రైనేజీ నీటి ద్వారా వచ్చే దుర్గంధాన్ని భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. మరికొంత మంది అనారోగ్యం భారిన పడుతున్నారు. ఇక ఏ చిన్నపాటి చినుకులు పడినా పరిస్థితి ఆధోగతే. రోజు ఆ దారిన వేలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

జిల్లాకు చెందిన అధికార యంత్రాంగం అదే దారిన వెల్లుతుంటారు. కార్పొరేషణ్ అధికారులు ప్రజాప్రతినిధులు నిత్యం ఆ దారిగుండా పయనిస్తుంటారు. కానీ ఎవ్వరు దీన్ని బాగు చేయాలని భావించకపోవడం బాధాకరం. తిరుపతిని అభివృద్ధి బాటపట్టాలని నగరంలోని ప్రధాన రహదారులన్ని విస్తరింప చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మన్నలను పొందేందుకు ప్రయత్నిస్తున్న కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు తిరుపతికి ప్రవేశించే ప్రదాన రహదారిలో మురుగునీరు నిల్వ ఉంటున్నా పట్టించుకోకపోవడం శోచనీచయం. స్థానికులు అనేకసార్లు కార్పొరేషన్ అధికారులకు, కార్పొరేటర్లకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా, ఆఖరికి స్పందనలో ఫిర్యాదు చేసిన తూతూమంత్రంగా తాత్కాలిక చర్యలు చేశామనిపిస్తున్నారు. మళ్లీ రెండురోజులకు పరిస్థితి యాథప్రకారమే అవుతోంది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలు కూడా దీనిపై నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వర్షాలే కాదు, యుడిఎస్ సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రాంతం నిత్యం మురుగునీటికి నెలవుగా మారుతోంది. ఆ చుట్టుపక్కల ఉన్న ఉక్కు, స్టీలు, రిపేరు షాపులు, టింబర్ డిపోలు, వివిధ వాహనాల షోరూములకు వెళ్లేవారికి కనీసం దారి కూడా లేదు. మురుగునీటిలో దిగాల్సిందే. ఇప్పటికైన కార్పొరేషన్ అధికారులు స్పందించి అక్కడ మురికినీరు వెళ్లేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగు నీటిలోనే నడక..

-శేఖర్, స్థానికుడు, పూలవానిగుంట.

ఈ రోడ్డు ఎప్పుడు మురుగునీటితో నిండి ఉంటుంది. పక్కనే ఉన్న షాపులకు వెళ్లాలంటే మురుగు నీటిలో దిగి, దుర్గాంధాన్ని భరిస్తూ నడవాల్సిందే. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల పరిస్థితి మరీ దారుణం. పాదచారుల కంటే వాహనదారులు పరిస్థితి ఇబ్బందిగా ఉంది. నీటిలోకి దిగితే వాహనాలు దెబ్బతింటాయి. స్పీడ్‌గా వెళ్లితే దుర్గందంతో కూడిన మురికినీరు చుట్టుపక్కల వారిపై వెదజల్లుతుంది. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు.

అధికారులకు చెప్పిన స్పందనలేదు

-సుబ్బారావు, స్థానిక చిరువ్యాపారి.

డ్రైనేజీ నీరు ఉప్పొంగడం, వర్షపునీటితో కలిసి చుట్టుపక్కల విస్తరించడంతో దుర్గంధాన్ని తట్టుకోలేక అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది అనారోగ్యం భారిన పడుతున్నారు. ఇక్కడ మురుగునీటిని శుభ్రం చేసి, రోడ్డును పరిశుభ్రంగా ఉంచాలని కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం, పారిశుధ్య విభాగం అధికారులను, ఉన్నతాధికారులను అనేకసార్లు కలిసి విన్నవించిన స్పందించడం లేదు. సుమారు ఏడాది కాలంగా ఈ ప్రాంతంలో ఇదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

10న రాస్తారోకోను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందని, రోజురోజుకీ పరిస్థితి దిగజారిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించి స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10వ తేదీ మంగళవారం రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం మురళి ఓ ప్రకటనలో తెలిపారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో గతంలో ఒక బ్లాస్ట్ ఫర్నేస్ మూతపడగా ఇప్పుడు మరో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా మూసేశారని, విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం సాలీనా 73లక్షల టన్నులు ఉండగా గత సంవత్సరం 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారని, ఈ ఏడాది ఇంకా తగ్గిపోతుందనీ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది రోజుకు 10 కోట్లు నష్టం రాగా, నేడు రోజుకు 15 కోట్లు చొప్పున నష్టం వస్తున్నదన్నారు. విశాఖ స్టీల్ దేశంలోనే నాణ్యమైన డిమాండ్ ఉన్న స్టీల్ అని, కావాలనే ఉత్పత్తి తగ్గించి కేంద్ర బీజేపీ విశాఖ స్టీల్‌ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్‌కు అప్పగించాలని కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మలు స్టీల్ ప్లాంట్‌ను సందర్శించారని విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోనే అత్యుత్తమమైనదని అన్నారని గుర్తు చేశారు. 45 రోజుల్లో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను రక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తానని, మోడీని ఒప్పించి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామని ప్రకటించారని అన్నారు. నేటికి రెండు మాసాలు దాటినా కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను సమర్థవంతంగా నడపడానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోగా, ప్లాంట్‌ను నాశనం చేయడానికి అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కారుచౌకగా కట్టబెట్టాలనే కుట్ర వేగంగా సాగుతున్నదన్నారు. దేశంలో అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులున్నా ఒక్క విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే సొంత గనుల్లేవని అన్నారు. సొంత గనులున్న ప్రైవేట్, ప్రభుత్వ కంపెనీలు ఇనుప ఖనిజం త్రవ్వి తీసుకోవడానికి టన్నుకు రూ.500లు మాత్రమే ఖర్చు అవుతుండగా, కానీ విశాఖ స్టీల్ ప్లాంట్ ఇనుప ఖనిజం టన్ను రూ.5,940లు పెట్టి మార్కెట్‌లో కొనాల్సి వస్తున్నదని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించడానికి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ముందు హామీనిచ్చిందని ఇప్పుడు దాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. టిడిపి ప్రభుత్వ మద్దతుతోనే కేంద్ర బీజేపీ ప్రభుత్వం నడుస్తున్నదని, టీడీపీ, ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎందుకు కాపాడలేకపోతున్నది? ఇప్పటికైనా టీడీపీ నాయకత్వం కేంద్ర బీజేపీపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీన విజయవాడలోని ప్రెస్‌క్లబ్లో జరిగిన రాష్ట్ర అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న ఉదయం 11 గంటలకు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు నిర్వహించాలని పిలుపునిచ్చాయని, అన్ని ప్రజాసంఘాలకు, రాజకీయ పార్టీలు ఈ రాస్తారోకో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

దీక్షా శిబిరంలోనే 'వినాయక చవితి'



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు గత 18 రోజులుగా టీటీడీ పరిపాలనా భవనం వద్ద నిరసన దీక్షలు చేపట్టిన విషయం విధితమే. శనివారం వినాయక చవితి సందర్భంగా శ్రీవారి మెట్టు చిరువ్యాపారుల కుటుంబాలు వినాయక చవితిని శిబిరంలోనే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి రోజు సైతం తాము టీటీడీ పరిపాలనా భవనం వద్ద ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ ఈఓ శ్యామలరావు, జేఈవోలు వెంకయ్య చౌదరి, వీరబ్రహ్మం తమ పట్ల సానుకూలంగా స్పందించి తమకు శ్రీవారి మెట్టుమార్గంలో వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

అబద్ధపు స్టేట్మెంట్‌ను వెనక్కి తీసుకోవాలి

భారత్ స్కౌట్స్, హిందుస్థాన్ స్కౌట్స్ అసోసియేషన్స్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : తిరుపతి డీఈఓ ఇచ్చిన తప్పుడు స్టేటేమెంట్‌పై హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమీషనర్ తుంగ శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో కేంద్ర మానవ వనరుల క్రీడా మంత్రిత్వశాఖ చే గుర్తింపు పొందిన రెండు స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలు ఉన్నాయని, భారత్ స్కౌట్స్, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్. ఈ రెండు కూడా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో తమ స్కౌట్స్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఒకటే ఉందని, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నకిలీదని తప్పుడు ప్రచారం జరుగుతోందని అదీ కూడా ప్రభుత్వ అధికారులు ఇలా ప్రచారం చేయడం నేరమన్నారు. దీనిపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి కంప్లైంట్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు తిరుపతిలో తమ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు ప్రారంభించలేదని విద్యాశాఖ వారు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోసం ఎందుకు పదేపదే ప్రాకులాడుతున్నారో వారికే తెలియాలన్నారు. 2023 జూన్ నెలలో కమీషనర్ పేరుతో ఇచ్చిన పత్రిక ప్రకటన కాపీని చూపిస్తూ ఇలా తప్పుడు స్టేటిమెంట్ ఇవ్వడం ద్వారా తమ సంస్థకు చెడ్డపేరు తేవాలనే ఆలోచన మానుకోవాలని హితవు పలికారు. తప్పనిసరిగా దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్తామని, తమ సంస్థ అభివృద్ధికి, పేరుకు భంగం కలిగించే అందరిపైనా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉపాధ్యాయులను సన్మానించి 'అభిలాష'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ చేస్తున్న కృషికి ప్రజల నుంచి ప్రోత్సాహం, సహకారం చాలా అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 136వ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం తిరుపతి మహతి ఆడిటోరియంలో అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యారంగంతో పాటు వేర్వేరు రంగాల్లో సేవలందిస్తూన్న గురువులను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత సాఫల్య బంగారు నంది, ఎక్సలెన్సీ, ఉత్తమ గురువుల పురస్కారాలతో సత్కరించుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వి.ఉమ, శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ మాట్లాడుతూ అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజనమ్మ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పేద ప్రజలకు అండగా ఉంటూ తన నిస్వార్థ సేవలు అందిస్తుండడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి సేవాతత్పరులకు సమాజం తగిన తోడ్పాటు అందివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. స్థానికంగా ఖాదర్ బాష షేక్, డాక్టర్ యోగీష్ బాబు తుంగ, కె.విజితలు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సరోజనమ్మకు అండగా నిలిచి తోడ్పాటు అందివ్వడం ప్రశంసనీయమని తెలిపారు. ఈసందర్భంగా వక్తలు ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు స్మరించుకున్నారు. ఆయన విద్యావేత్తగా, పండితుడిగా, భారతదేశ మొదటి ఉప రాష్ట్రపతిగా, రెండోసారి రాష్ట్రపతిగా సేవలు అందించారని, ఉపాధ్యాయ వృత్తిపట్ల ఆయనకున్న గౌరవం, అంకితభావాన్ని గుర్తించి అతని జయంతిని ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నారని పేర్కొన్నారు.

సత్కారాలు పొందిన పలువురు ప్రముఖులు

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నామని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. విజయవాడను వరద ముంచెత్తిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో అక్కడ సహాయక చర్యలు చేపట్టేందుకు బుధవారం రాత్రి కమిషనర్ ఆధ్వర్యంలో 80 మంది పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్, హెల్త్ అధికారులు విజయవాడకు వెళ్లారు. విజయవాడ 15 డివిజన్‌లోని రామలింగేశ్వర్ కట్ట, రంజిత్ భార్గవ్‌రోడ్డు, గాంధీ కాలనీ, ఈనాడు కాలనీ, శివశంకర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గురువారం తెల్లావారు జామునుండే సహాయక చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం నుండి కాలువల్లో పేరుకుపోయిన బురద, చెత్త తొలగింపు, ఎక్కడికక్కడ ఆగిపోయిన వర్షపు నీటిని తొలగిస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి, ఫాగింగ్ చేయిస్తున్నారు. శని, ఆదివారాల్లో జోరువర్షం కురుస్తున్నా సిబ్బంది పనులు చేశారు. అన్ని పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ మౌర్య ఇంటింటికీ వెళ్లి బాధితులకు కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఇంటివద్దకే వచ్చి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించడం పట్ల కమిషనర్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిషన్ మౌర్య నేతృత్వంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సహాయం చర్యల్లో మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, ఆరోగ్యాశాఖధికారి డాక్టర్ యువ అన్వేష్, డీఈలు సంజయ్ కుమార్, మహేష్, రాజు, నరేంద్ర, రవీంద్ర రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

వైకుంఠం కాంప్లెక్స్ వద్ద

గుండెపోటుతో మహిళ మృతి

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో ఝాన్సీ (32) మహిళ హఠాన్మరణం చెందింది. శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలుచున్న ఆ భక్తురాలు గుండెపోటుతో కుప్పకూలింది. వెంటనే స్పందించిన ఇతర భక్తులు సీపీఆర్ చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న స్థానిక వైద్య సిబ్బంది అంబులెన్స్‌తో వచ్చారు. నర్సులు కూడా సీపీఆర్ చేసినా ప్రయోజనం కనిపించలేదు. ఆ భక్తురాలిని ఆసుపత్రికి తీసుకెళు తుండగా, మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లో శనివారం వేకువ జామున 3.30 గంటలకు ఈ ఘటన జరిగింది. మృతి చెందిన భక్తురాలి స్వస్థలం కడప అని గుర్తించారు. ఆమె లండన్ లో స్థిరపడినట్టు తెలిసింది. ఝాన్సీ అకాలమరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతురాలికి కవల పిల్లలు ఉన్నారు. కాగా, అంబులెన్స్ రాక ఆలస్యమైందని, క్యూలైన్‌లో కనీసం సమాచారం అందించేందుకు ఫోన్ సౌకర్యం కూడా లేదని మృతురాలి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మృతురాలు ఝాన్సీ

తెలుగు షాదీ డాట్ కామ్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి కోసం ఏర్పాటు చేసిన తెలుగు షాదీ డాట్ కామ్ 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.మనీష్ మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా సాది ఉత్సవాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 14 తేదీ వరకు రెండు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో విజేతకు అద్భుతమైన వివాహ బహుమతిని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మహత్తరమైన స్టార్ పవన్ జోడిస్తూ టీవీ, యాడ్ ఫిల్మ్ ను ఆవిష్కరిస్తున్నామన్నారు. ఈ పోటీలో పాల్గొనేందుకు సరళమైన నియమాలను ఏర్పాటు చేశామని, పోటీ కాలంలో చెల్లింపులను అప్లోడ్ చేసిన వారు పోటీకి అర్హులని తెలిపారు. ఇందులో మొదటి విజేతకు తమ కలల వివాహాన్ని ప్లాన్ చేసే అవకాశం కల్పిస్తారు. వీరితోపాటు మరో 20 మందికి బంగారు నాణ్యాలను అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని వినియోగదారులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టయోటా కిర్లోస్కర్ టి కేర్ కార్యక్రమం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అసాధారణమైన అనుభవాలను అందించడం ద్వారా కస్టమర్ అంచనాలను అధిగమించాలనే నిరంతర ప్రయత్నంలో భాగంగా టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) వినూత్న కార్యక్రమం టి కేర్‌ని ప్రారంభించినట్లు ఆ సంస్థ సేల్స్, సర్వీస్, యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. టీ కేర్ ప్రారంభం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కస్టమర్-సెంట్రిక్ విధానం ద్వారా నడిచే, "టి కేర్" కస్టమర్ ఆనందాన్ని మెరుగుపరచడానికి, దీర్ఘకాలిక సంబంధాలను పెంపొందించడానికి కంపెనీ అంకితభావాన్ని ప్రదర్శిస్తూ సమగ్రమైన సేవలను అందిస్తుందని తెలిపారు. తాము చేసే ప్రతి పనిలో కస్టమర్‌లు ప్రధానంగా లక్ష్యంగా చేసుకుని విక్రయానికి ముందు, విక్రయ సమయంలో, తర్వాత ప్రతి టచ్‌పాయింట్‌లో కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచడంపై ఎల్లప్పుడూ దృష్టి సారిస్తుంటామని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన టి కేర్ కార్యక్రమం, టి డెలివర్, టి గ్లాస్, టి అసిస్ట్, టి సాథ్, టి సెక్యూర్, టి చాయిస్, మరిన్ని వంటి విస్తృత శ్రేణి ఆఫర్‌లను కలిగి ఉందని వెల్లడించారు. టి కేర్, తమ కస్టమర్ కనెక్షన్‌ని మరింత బలోపేతం చేస్తుందని, వినియోగదారులు తమపై ఉంచిన వారి అపారమైన నమ్మకాన్ని బలపరుస్తుందని, తద్వారా మొబిలిటీ కంపెనీగా మారాలనే టొయోటా ఉద్దేశానికి మద్దతు ఇస్తుందని తెలిపారు. టికెఎం ప్రస్తుతం 685 కస్టమర్ టచ్ పాయింట్‌లతో పాటు 360 టి స్పార్ష్ అవుట్ లెట్‌లను కలిగి ఉందని, ఇది భారతదేశం అంతటా మొత్తం 1045 టచ్ పాయింట్‌లను కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు విజయవంతం చేయాలని కోరారు.

ప్రశాంతవాతావరణంలో గణేష్ నిమజ్జనం

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి: ఎమ్మెల్యే, మేయర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: విఘ్నాలకు అధిపతి అయినా విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఆర్‌సి. మునికృష్ణ, పొన్నాల చంద్ర, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్యలు పాల్గొని గణనాథుడికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో తిరుపతి నగర ప్రజలు, అధికారులు, సిబ్బంది సుఖసంతోషాలతో జీవించాలని అన్నారు. అమరావతిలో ఏర్పడిన ఇబ్బందులు అన్ని నేటితో తొలగిపోవాలని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రజల కోసం పడుతున్న కష్టానికి ఆ దేవదేవుని ఆశీస్సులు మెండుగా ఉండాలని అన్నారు. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి పూజల్లో పాల్గొనడం సంతోషం అన్నారు. కార్యక్రమాలలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, డీఈ విజయకుమార్ రెడ్డి, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ చతుర్థశి వేడకలు తిరుపతిలో వేడుకగా ప్రారంభమయ్యాయి. గణేష్ మండపాల్లోనూ, ఇళ్లలో వినాయకుడు కొలువై పూజలు అందుకుంటున్నాడు. శనివారం ఉదయం తన నివాసంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన సతీమణి సత్యవతితో కలిసి గణనాథున్ని పూజలు నిర్వహించారు. తుడ మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్ ఈ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎన్జీఓ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో ఎమ్మెల్యే దంపతులు పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలను మండపాల నిర్వాహకులు ఏర్పాటు చేయగా స్వయంగా ఎమ్మెల్యే భక్తులు వడ్డించారు. శనివారం సాయంత్రం గణనాథుని నిమజ్జన కీలక వేదికైన వినాయకసాగర్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సందర్శించారు. నగరవాసులు తమ కుటుంబసభ్యులతో కలిసి ఇళ్లలో ప్రతిష్టించిన వినాయక ప్రతిమలను సాగర్‌లో నిమజ్జనం చేశారు. తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే వినాయకుని ప్రతిమలను నిమజ్జనం చేశారు. సోమవారం జరిగే నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో నిమజ్జనాన్ని పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఎన్వీ ప్రసాద్, మబ్బు దేవనారాయణ రెడ్డి, పులుగోరు మురళీ, లక్ష్మీపతి రాయల్ , డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, పొలకల మల్లిఖార్జున్, వూకా విజయ్ కుమార్, కోడూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

వినాయక చవితి పూజల్లో ఎమ్మెల్యే

భక్తులకు అన్నప్రసాద వితరణ

రేణిగుంట: రేణిగుంటలోని జిఎం స్ట్రీట్‌లో శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు ప్రతిమ మండలంలో ఆదివారం మధ్యాహ్నం టి.మునికృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులపాటు జరిగే వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకి అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ముఖ్య సలహాదారులు జూలియన్ రాజు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా జీఎం స్టేట్లో అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అసోసియేషన్ సభ్యుల కృషితోనే ప్రతి సంవత్సరం విజయవంతంగా ఉత్సవాలను జరుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, కమిటీ సభ్యులు సుబ్బు, దినేష్, సుమన్, పవన్, కళ్యాణ్, ధనుంజయ్, గణేష్, ప్రదీప్, ముని, సుధ, గజ, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

22న రిపబ్లిక్ క్లబ్ ఎన్నికలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెల 22న రిపబ్లిక్ క్లబ్ ఎన్నికలు జరగనున్నాయి. ఆ మేరకు ఆదివారం క్లబ్ ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేశారు. రిపబ్లిక్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి, సభ్యులుగా క్లబ్‌సభ్యుల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 9,10 తేదీలలో నామినేషన్ల దాఖలు చేయాలని సూచించారు. 11న, నామినేషన్ల పరిశీలన, 12న ఉపసంహరణ, 22వ తేదీ ఆదివారం ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు ఎన్నికలు ఫలితాలు వెల్లడిస్తారు. క్లబ్‌లో ఇదేళ్ల పైబడి సభ్యత్వం కలిగిన సభ్యులు మాత్రమే పోటీకి అర్హులనీ, ఏదో ఒక పదవికి మాత్రమే పోటీ చేయాలని నిబంధనల్లో పేర్కొన్నారు.

గూడూరు సబ్ కలెక్టర్‌గా రాఘవేంద్ర మీనా

బాధ్యతలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గూడూరు సబ్ కలెక్టర్‌గా రాఘవేంద్ర మీనా బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవో కిరణ్ కుమార్ సబ్ కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ట్రైనింగ్ కలెక్టర్‌గా పని చేశానన్నారు. మొదటి పోస్టింగ్ గూడూరు సబ్ కలెక్టర్ గా వచ్చానని తెలిపారు. డివిజన్‌లో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అందరూ సహకరించాలని కోరారు. అనంతరం తహశీల్దార్లతో సమావేశం అయ్యారు.

'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఏపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణలో భాగంగా చేపడుతున్న 'పొలం పిలుస్తోంది' వాల్ పోస్టర్లను మండల వ్యవసాయ అధికారులతో కలిసి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడమాలపేట మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి సాధించి రైతుల నికర ఆదాయం పెంచడానికి వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రతి మంగళవారం, బుధవారం ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. రైతులు ఆధునిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయ మెళకువలు తెలుసుకొని అధిక పంట దిగుబడి సాధించి తమ ఆదాయం పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరి ఏవో రాఘవ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి: బాలగురవం బాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఘన చరిత్ర కలిగిన పార్టీ అని, ఆ పార్టీ ఆధ్వర్యంలో దేశానికి ఎన్నో బహుళార్థ ప్రయోజనాలు చేకూరాయన్నారు. ఏపీ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో 2029లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా జిల్లా పార్టీ క్యాడర్ లోని ముఖ్యులను అందరిని కలుపుకొని ముందుకు వెళతామన్నారు. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్‌కు, జిల్లాలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో చిరంజీవి, నాని, దాము, వేలుర్తి, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - తడ: తడ మండలంలోని కాంబాకం కుప్పం యంపియూపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి రఘురామయ్యను తిరుపతిలోని వేద ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి సిఐ మధుసూదన్ , జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి హనుమంతరావు చేతుల మీదుగా గురుపూజోత్సవం సందర్భంగా ఘన సన్మానం చేశారు.

అవాంఛనీయ సంఘటనలు లేకుండా చూడాలి: సిఐ

ప్రజాశక్తి - సత్యవేడు: వినాయక మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని సత్యవేడు సిఐ మురళీనాయుడు కోరారు. వినాయక చవితి సందర్భంగా వాడ వాడలా ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సిఐ పరిశీలించి సంబంధిత నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా సత్యవేడు మండలం వెంకటరాజులుకండ్రిగలో చలువ పందిళ్లలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను, పరిసరాలను సిఐ పరిశీలించారు. వినాయక మండపం వద్ద రాత్రి వేళల్లో తప్పనిసరిగా ఉండాలన్నారు. వినాయక పూజలు చేసేటప్పుడు నిప్పురవ్వలు ఎగిసి పడ కుండా జాగ్రత్త వహించాలన్నారు. నిమజ్జనానికి ఒకరోజు ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజా రవాణాకు అంతరాయం లేకుండా వినాయక ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలని సూచించారు.

ఘనంగా నితిన్ సంపత్, అభిరామిల వివాహం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నరువి హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ జీవీ సంపత్ కుమారుడు నితిన్ సంపత్ వివాహం అడయా ర్ ఆనంద్ భవన్ ఎండీ కెటి వెంకటేషన్ కుమార్తె అభిరామితో వివాహం ఈ నెల 5వ తేదీ ఘనంగా నిర్వహించారు. చెన్నై నీలాంగరై లోని ఆర్కే కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన ఈ వివాహానికి పలువురు వీఐపీలు, మంత్రులు, జడ్జీలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారిలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీరుసెల్వం, మాజీ గవర్నర్ తమిలిసై సౌందర రాజన్, మాజీ కేంద్ర మంత్రి జీకే వాసన్, టిటిడి బోర్డ్ మాజీ సభ్యుడు శేఖర్ రెడ్డి, యూనివర్సిటీల చాన్స్ లర్లు పెద్ద సంఖ్యలో వివాహ రిసెప్షన్ కు హాజరయ్యారు.

బిసి కులగణన చేయాలి

వినాయకునికి వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్‌లో తక్షణమే బిసి కులగణన చేసే బుద్ధి పాలకులకు ప్రసాదించాలని ఏపీ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కులగణన చేసి అత్యంత వెనుకబడిన బిసి కులాల అభివృద్ధికి, బిసి హాస్టల్స్ కి శాశ్వత భవనాలు నిర్మించేందుకు, బీసీ హాస్టల్ విద్యార్థులకి మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచే విధంగా పాలకుల బుద్ధి మార్చాలని వినాయకుని విగ్రహాన్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో డాన్ ఏజరా, ఆదర్శ్, ఫిరోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వినాయక చవితిని పురస్కరించుకొని పుత్తూరు కాపు వీధిలో గేటు పుత్తూరు క్యాబిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను ఆదివారం సందర్శించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, మురళి, టిడిపి రాష్ట్ర వాణిజ్య ప్రధాన కార్యదర్శి డిఎస్ గణేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సిఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు సిఐ ఎస్ జయచంద్ర ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచనలతో మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తున్నామని, బయట ప్రాంతాల నుండి వస్తున్న గంజాయితో యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నట్లు ఫిర్యాదులు అందాయని, గంజాయిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పాపానాయుడు పేట ప్రాంతంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడం వల్ల కొంతమేరకు అన్యాయాలు, అక్రమాలును అరికట్టడానికి, జూదం, మద్యం, గంజాయి వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

రోడ్లన్నీ గుంతలమయం..!

- కానరాని పరిష్కారం..
- స్పందించని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఇబ్బందుల్లో వాహన చోదకులు, ప్రజలు

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలో రహదారులు గుంతల మయంగా మారి అధ్వానంగా మారాయి. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారులు అధ్వానంగా మారడంతో రహదారులకు మోక్షం ఎప్పుడొస్తుందోనని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోట ఆర్‌టిసి బైస్టాండు నుంచి కోట క్రాస్ రోడ్డు వరకు రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు వుండడంతో ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు అనుక్షణం నరకయాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం గుంతల్లో నీరు లేని కారణంగా ప్రయాణికులు అప్రమత్తంగా చూస్తూ వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. అదే వర్షం పడితే గుంతలు ఎక్కడ వున్నాయో.. ఎలా వున్నాయో కూడా పరిశీలించలేని పరిస్థితుల్లో ప్రమాదాలకు గురయ్యే దుస్థితి నెలకొందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు ఇలాగే వుంటే ద్విచక్ర వాహనాలు తిరగలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మాత్రం స్పందించడంలేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, ఆర్‌అండ్‌బి అధికారులు అప్పుడప్పుడూ తూతూ మంత్రంగా మరమ్మతులు చేస్తున్నారు తప్ప శాశ్వత మరమ్మతులు చేపట్టడంలేదని పేర్కొంటున్నారు. రోడ్డు మరమ్మతులు శాశ్వతంగా చేపడితే ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా పూర్తి పరిష్కారం లభిస్తుందని ప్రజలు అంటున్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి ప్రజలకు, వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి..

కోట ఆర్‌టిసి బస్టాండ్ నుండి కోట క్రాస్ రోడ్డు వరకు మొత్తం గుంతలు మయంగా మారింది. ఈరోడ్డుకు త్వరలో మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని పరిష్కరించాలి

- కర్లపూడి పోలయ్య, బిఎస్‌పి గూడూరు డివిజన్ కోశాధికారి.

గురువులను గౌరవించడం అందరి బాధ్యత: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉంటుందని అలాంటి గురువులను గౌరవించడం అందరి బాధ్యత అని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఉపాధ్యాయులను సన్మానించి వారి నుండి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైందని అలాంటి ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహోన్నతుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అని ఆయన పుట్టిన రోజును దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం గా నిర్వహిం చుకోవడం ఆయనకు ఇచ్చే గౌరవం గా భావిస్తున్నామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్రగతి సేవాసంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రు లు పాల్గొన్నారు.

గురువులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ఉషారాణికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: స్థానిక భాకరాపేటకు చెందిన రచయిత్రి ధనాసి ఉషారాణి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. తెలుగు రచయితల సంఘం చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం రచయిత్రి ధనాశి ఉషారాణి జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. విద్యా రంగం, సేవా రంగంలో అందించిన విశిష్ట సేవలకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు, సినీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ , కన్నడ నటి సీతమ్మ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు పనసల హరికృష్ణారెడ్డి , రఘుపతి నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో వంద మంది కవులు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడం సంతోషంగా వుందని రచయిత్రి ఉషారాణి అన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ధనాసి ఉషారాణి

రంకెలేసిన కోడెగిత్తలు

జల్లికట్టులో పలువురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం గంగుడుపల్లి లో యువకుల జోరుతో జల్లికట్టు జోరుగా సాగింది..కోడెగిత్తలు రంకెలేశాయి.. ఆదివారం వినాయక చవితి సంబరాల సందర్భంగా గంగుడుపల్లిలో కోడెగిత్తల పరుష పందేలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వాహనాలలో కోడె గిత్తలను గంగుడుపల్లికి తరలించారు. ఆవుల కొమ్ములకు రంగులు వేసి పలకలు కట్టి 'కోడె గిత్తల పౌరషాన్ని చూడండి..' అంటూ వాటి యజమానులు 'మీ వల్ల అయితే పట్టుకోండి చూద్దాం..' అంటూ నగదు విలువైన పలకలు, దుస్తులను కొమ్ములకు కట్టి దొడ్లో నుంచి బరిలోకి దించారు. అప్పటికే మండలం నుండే కాకుండా చుట్టుపక్కల మండలాలు, జిల్లాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి వాటికి కట్టిన నగదు పలకలను చేజిక్కించేందుకు పోటీపడ్డారు. పశువుల పాక నుండి బరిలోకి దించి కోడెగిత్తలు వెనక డప్పులు వాయిస్తూ వాటిని బెదర కొట్టగా అవి బెదిరి దూకుడు గా పరిగెత్తడంతో యువకులు పౌరుషంతో పోటీపడ్డారు. ఈ పోటీలో వాటిని నిలువరించే ప్రయత్నంలో స్వల్ప సంఘట నలు చోటు చేసుకున్నాయి. కొంత మంది యువకులకు స్వల్ప గాయా లయ్యాయి. ఈ పందేలను తిలకించేందుకు అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు. స్థానికులు భోజనం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీచర్ రెడ్డప్ప నాయుడుకి అరుదైన గౌరవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఎర్రావారిపాళ్యం మండలం బోడెవాండ్లపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ రెడ్డప్ప నాయుడుకి అరుదైన గౌరవం దక్కింది. ఆదివారం తిరుపతి యూత్ హాస్టల్ లో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను గుర్తించి సన్మానం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా బోడెవాండ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్ రెడ్డప్ప నాయుడుని 'గురుదేవోభవ' జాతీయ పురస్కారంతో సత్కరించారు. ఈయన 15 ఏళ్లుగా గణిత శాస్త్రంలో విద్యార్థులకు ఉన్నత విలువలతో బోధిస్తున్నారు. ఈయన దగ్గర పాఠాలు నేర్చుకున్న సుమారు పది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. చిన్నగొట్టిగల్లు మండలం గాండ్లపల్లి ప్రాథమిక పాఠశా లలో పనిచేస్తున్న గీతారాణి, కొమ్మిశెట్టివారిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న విజయ కుమారిలకు 'వే ఫౌండేషన్' అధ్యక్షులు పైడి అంకయ్య ఆధ్వర్యంలో పురస్కారాలు ఇచ్చారు. తుడా బిసి వెంకట నారాయణ ముఖ్య అతిథిగా హాజరైన టీచర్లకు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.

రెడ్డప్పనాయుడుని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్ ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దసరథాచారి ఆదివారం ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు రాష్ట్రం నుంచి ఇద్దరే ఎంపిక కాగా, వారిలో ఒకరు శ్రీకాళహస్తి వాసి కావడం మనందరికీ గర్వకారణం అని దశరధాచారి పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిఎస్‌పి నరసింహమూర్తి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి నరసింహ మూర్తి అదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి కేసుల వివరాలు, స్టేషన్‌లో సిబ్బం ది కొరత, వివిధ సమ స్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసు కున్నారు. పోలీస్ స్టేషన్‌లో పాత కేసులు ఎన్ని కేసులు నమోదు చేశారు? పెండింగ్‌లో వున్నాయో అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవంగా విచారించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎస్ఐ విశ్వనాథ నాయుడుకు సూచించారు. మండలంలో ఎవరైనా గంజాయి, అక్రమ మద్యం, తరలిస్తే ప్రత్యేక నిఘా ఉంచాలని, జూదం , కోళ్ల పందేలుపై కఠిన చర్యలు తీసుకుని నివారించాలన్నారు. ట్రాఫిక్ నియంత్ర ణను కట్టుదిట్టం చేయాలని, అనుమతులు లేని వాహనాలను పరిశీలించి వాటిపై చట్ట పరమైన కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులపై మాట్లాడుతూ వెంటనే వాటిని విచారించి పూర్తి చేయాలని, మద్యం తాగి వాహనాలు నడిపే వారిని వెంటనే అదుపులోకి తీసుకుని విచారించి వారిపై చట్టపరమైన కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నానిపై అవాస్తవ ప్రచారం తగదు: టిడిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నానిపై మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి చెందిన దినప్రతికలో అవాస్తవాలను ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామని తిరుపతి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పుతో అయినా వైసిపి వారు బుద్ధి తెచ్చుకోకుండా అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. అధికారంలోకి వచ్చి కనీసం వంద రోజులు అయినా కాకముందే ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం, అధికారుల బదిలీలలో డబ్బులు తీసుకున్నారని ప్రజల దృష్టిని మరల్చడానికి కుట్రపూరిత ప్రచారాలు చేయడం వాస్తవం కాదన్నారు. చంద్రగిరి నియోజక వర్గంలో టిడిపి క్యాడర్ అసంతృప్తితో ఉన్నారని ప్రచారం చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని ఇబ్బందుల పాలు చేయడానికి మాజీ సీఎం జగన్ కంకణం కట్టుకున్నారన్నారు. విజయవాడలో వరదలతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సహాయక చర్యలకు సహరించకపోగా విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో చంద్రగిరి మండల టిడిపి అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎర్రావారిపాలెం మండలం టిడిపి అధ్యక్షులు రఘురామ్, బెల్లంకొండ మురళి, కత్తి సుధాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు టిడిపి నాయకుల వినతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) తన అనుచరుల ద్వారా ఉద్యోగుల నుంచి లంచాలు వసూలు చేసి తిరుపతి రూరల్ మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులను బదిలీలు చేయిస్తున్నట్లు తప్పుడు ప్రచారం కథనాలు ప్రచురించిన పత్రిక, వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు ఆర్‌సి పురం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌కి ఆదివారం ఫిర్యాదు చేశారు. మన అనుపల్లి వాట్సాప్ గ్రూప్‌లో గ్రూప్ అడ్మిన్ గా ఉన్న వ్యక్తి సాక్షి దినపత్రికలో వచ్చిన కట్టింగు, తప్పుడు సమాచారాన్ని ఫార్వర్డ్ చేసి ఉండడంతో ఆధారాలను తీసుకుని ఫిర్యాదు అందించినట్లు టిడిపి నాయకులు మేకల తిరుమలరెడ్డి, చిన్న బాబు, సి జనార్దన్ చౌదరి, కోరా హరి ప్రసాద్, రామిరెడ్డి, కె ధనంజయులు తెలిపారు. ప్రభుత్వ బదిలీల నిబంధనలు మేరకు బదిలీలు నిర్వహిస్తుంటే, నగదు తీసు కొని బదిలీలు చేస్తున్నారని ఎమ్మెల్యే పులివర్తి నానిపై అసత్య ఆరోపణలు చేయించడం, కథనాలను ప్రచురించడం మంచి పద్ధతి కాదని వారికి హితువు పలికారు. ఎమ్మెల్యే పులివర్తి నాని గౌరవ ప్రతిష్టను దిగజార్చేలా సోషల్ మీడియాలో ప్రచారం చేసిన గ్రూప్ అడ్మిన్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

పోలీసులకు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

సిఎం సహాయనిధికి విరాళం

ప్రజాశక్తి -కోట : వరద బాధితుల సహాయార్థం సిఎం సహాయ నిధికి అందించాలని కోరుతూ రూ.25 వేలు చెక్కును తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ఆ మండల టిడిపి అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమ రెడ్డికి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా జలీల్ అహ్మద్ మాట్లాడుతూ హఠాత్తుగా సంభవించిన విపత్తులో నష్టపోయిన ప్రతి ఒక్కరినీ టిడిపి ప్రభుత్వం ఆదు కుంటుందన్నారు. వరద బాధితులకు సాయం చేసేందుకు ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు దేశం నలుమూలలు, రాష్ట్ర వ్యాప్తంగా అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఉద్యోగులు తమ వేతనాల నుండి సాయం అందిస్తున్నారని, అందుబాటులో ఉన్నవాళ్లు ప్రత్యక్షంగా నిత్యావసర సరుకులు అందించి సేవా తత్పరతను చాటుతున్నారని అభినందించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని వీధుల్లో 74 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు నాయుడు పర్యటించి వారికి అందుతున్న సహాయ సహకా రాలపై ఆరా తీస్తున్నారని, రాత్రింబవళ్లు కష్టపడి ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించి సకా లంలో ప్రజలకు ఉపశమనం కల్పించారని ప్రశంసించారు. డ్రోన్ల ద్వారా బాధితులకు సరకుల పంపిణీ చేశారన్నారు. విపత్తులు, ఆపద వేళల్లో సేవాగుణాన్ని చాటుకునే షేక్ జలీల్ అహ్మద్ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పిలుపు మేరకు ఇక్కడి నాయకులు విజయవాడలో సహాయక చర్యల్లో నిమగ్నమవుతున్న నేపథ్యంలో 25వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో సిఎం సహాయ నిధికి అందించాలని ఆ పార్టీ టిడిపి కోట మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమ రెడ్డికి ఆయన అందించారు.

చెక్కును అందిస్తున్న షేక్ జలీల్ అహ్మద్

గూడూరు టౌన్ : గూడూరు బనిగి సాహెబ్ పేట టిడిపి నాయకులు లక్షాపదివేల రూపాయల చెక్కును గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు ఆదివారం అందించారు. బలిజ కమ్యూనిటీలో 90 శాతం మంది ప్రజలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేందుకు సహకరించారని వారందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. గూడూరు పట్టణంలోని సుందర్ మహల్ కాంప్లెక్స్ లో బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధికి ఇవ్వాలని కోరుతూ 2 లక్షల రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యేకు అందించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట రమణ రెడ్డి 55 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యేకి అందించారు. ఈ కార్యక్రమంలో చదలవాడ హరిబాబు , శీలం కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి రైల్వేస్టేషనులో గంజాయి తీసుకొని వెళుతున్న వ్యక్తిని శనివారం అర్ధరాత్రి తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నామని సిఐ ఎవిరమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన నరసింహరాజు 3 కేజీల గంజాయి తీసుకు వెళుతుండగా గుర్తించి అరెస్టు చేశామని తెలిపారు. ఈ గంజాయిని ఒరిస్సా నుండి కొనుగోలు చేసినట్లు గుర్తించామని, విలువ సుమారు 33 వేల రూపాయిలు ఉంటుందన్నారు. ఈ గంజాయి తిరుపతిలో విక్రయించేందుకు వెళుతున్నట్లు నిందితుడు తెలిపినట్లు పేర్కొన్నారు.

గూడూరు టౌన్: గూడూరు బైపాస్ జంక్షన్‌లో వైజాగ్ నుండి చెన్నై కి వెళుతున్న బస్సులో గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని గూడూరు రూరల్ పోలీస్‌లు ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ మాట్లాడుతూ గుంటూరు, అనంతపురం జిల్లాలకు చెందిన నీలయ్య, సంజయ్ కుమార్, ఉమాశంకర్‌లు వైజాగ్ నుండి చెన్నైకి బస్సులో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. గంజాయి విలువ సుమారు 3 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా అక్రమంగా గంజాయి తరలిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి తిరుపతి, కడప జిల్లాలో నిర్వహించిన రెండు వేర్వేరు తనిఖీల్లో 40 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు స్మగ్లర్లును టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్‌పి ఎల్ సుబ్బారాయుడు ఆదేశాలు మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్‌పి పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఐ సురేష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఎస్ఐ లింగాధర్ శనివారం తెల్లవారుజామున కరకంబాడి అటవీ ప్రాంతంలోని తిరుపతి–కడప జాతీయ రహదారిలో ఆంజనేయపురం చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారన్నారు. ఈ క్రమంలో వచ్చిన ఒక కారును తనిఖీ చేయగా అందులోని ఇద్దరు వ్యక్తులు కారులో నుంచి దిగి పారిపోయారన్నారు. మరో ఇద్దరిని టాస్క్ ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకుందని తెలిపారు. వారు ఇద్దరు తమిళనాడులోని సేలం జిల్లాకు చెందిన వారు. వారిని అరెస్టు చేసి, కారులోని 12 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఎస్ ఐ నరేష్ బృందం కడప జిల్లా వేంపల్లి వద్ద చక్రాయపేట సమీపంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా మాలాబీళ్లు వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలతో వస్తుండగా చుట్టుముట్టామన్నారు. పారిపోతున్న వారిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇతను కడప జిల్లా చక్రాయిపేట మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. ఆ ప్రాంతంలో పడి ఉన్న 28 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ రెండు కేసులను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో కేసును సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఈ ఆపరేషన్లలో స్థానిక అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరు గ్రామాల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలంలోని రాగిగుంట పెరిందేశం గ్రామాలలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకుంటూ ఉండగా ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుని అది కాస్త పెద్దదై రెండు గ్రామాల ప్రజలు కొట్టుకోవడంతో ఈ విషయం తెలుసుకున్న పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేష్ కెవిబి పురం ఇన్‌ఛార్జిగా ఉండడంతో ఈ విషయాన్ని ఆయనకు తెలిపారు. వెంటనే ఆయన సంఘటన స్థలానికి చేరుకుని అక్కడి ఘర్షణను ఆపేందుకు ప్రయత్నిస్తుండగా ఎస్ఐ కి గాయం కావడంతో వెంటనే అడిషనల్ ఎస్‌పి రవి మనోహర్ ఆచారి దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే ఆయన వారి సిబ్బందితో రెండు గ్రామాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరు గ్రామాల వారు ఘర్షణ పడి ఎస్ఐ వెంకటేష్‌ను గాయ పరిచారన్నారు. ఆ దారిలో వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు పిచ్చాటూరు నుండి శ్రీకాళహస్తి వెళుతున్న బస్సును ఆపి అద్దాలు ధ్వంసం చేశారు. బస్ డ్రైవర్ కండక్టర్ ఫిర్యాదు చేశారని, ఈ ఘటనకు పాల్పడిన ఇరు గ్రామాల్లో వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని, ఈ ఘర్షణకు పాల్పడిన వారిపై గతంలో కేసులు ఉంటే వారిపై రౌడీషీటర్ ఓపెన్ చేస్తామని ఆయన తెలిపారు. గ్రామాలలో ఎవరూ ఘర్షణలకు పాల్పడకూడదని ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రవికుమార్, సిఐలు గోపి, ఈశ్వర్, మురళి, భాస్కర్ నాయక్ ఎస్ఐలు వెంకటేష్ ధర్మారెడ్డి రాజశేఖర్ సునీల్ మల్లికార్జున రెడ్డి వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చికిత్స

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఫిజియో థెరపీ డే సందర్భంగా డాక్టర్ గీత అడ్వాన్స్డ్ ఫిజియో థెరపీ క్లినిక్ ఆధ్వర్యంలో రోగులకు ఆదివారం ఉచితంగా చికిత్స చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గీత మాట్లాడుతూ ఫిజియోథెరపీ విధానం వల్ల మెడిసిన్ లేకుండా, శస్త్ర చికిత్స లేకుండా కేవలం ఫిజియోథెరపీ వల్ల పూర్తి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఆదివారం ఉచితంగా ఫిజియోథెరపీ చికిత్స చేస్తామని తెలిపారు. వివరాలకు డాక్టర్ గీత అడ్వాన్స్డ్ ఫిజియో థెరపీ క్లినిక్, కార్వేటి నగరం రోడ్డులోని పద్మావతి హాస్పిటల్ వెనుక సంప్రదించాలన్నారు. ఫోన్ 8639222291, 8179178175 లను సంప్రదించవచ్చున్నారు.

భారీ లడ్డూను దక్కించుకున్న ఎన్ఆర్ఐ

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు మండలం మల్ల వారి పాలెం పడమర గ్రామానికి సంబంధించి వినాయక చవితి సంద ర్భంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన 12 అడుగుల భారీ గణేష్ విగ్రహం చేతిలోని 22 కేజీల లడ్డూను లక్షా 40 వేల రూపాయలకు వేలం పాట ద్వారా ఎన్ఆర్ఐ జస్వంత్ దక్కిం చు కున్నారు.

అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి లో రోగుల సౌక ర్యార్థం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం సౌజన్యంతో నిత్యాన్న దాన పథకాన్ని ఆదివారం మళ్లీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడు తూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆగిన ఈ పథకా న్ని కూటమి ప్రభుత్వంలో తిరిగి ప్రారంభించడం సంతోషంగా వుందని తెలిపారు.

గౌరవ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు గూడూరు

I.P.NO. 33 / 2023

వెదనపర్తి బుజ్జమ్మ ...పిటీషనరు

Vs

1. పట్టుకోట సుగుణ
2. మద్దు సౌజన్య ....రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై నెంబరు నందలి పిటిషనరు అయిన వెదనపర్తి బుజ్జమ్మ W/o లేట్ నరసారెడ్డి, అన్నమేడు గ్రామము, నాయుడుపేట మండలం, తిరుపతి జిల్లా అను ఆమె మొదటి రెస్పాండెంటు అయిన పట్టుకోట సుగుణ, W/o శ్రీనివాసులు, అన్నమేడు గ్రామము, నాయుడుపేట మండలం, తిరుపతి జిల్లా అను ఆమెను దివాలాకోరుగా తీర్మానించి ఆమె రెండవ రెస్పాండెంటు అయిన మద్దు సౌజన్య గారి మీద రిజిష్టరు చేయబడిన డాక్యుమెంటు నెం. 3018/2023 రు సూళ్ళూరుపేట తేది. 18-7-2023ను రద్దు పరచవలసినదిగా కోరుచూ పై నెంబరు పిటిషనును దాఖలా చేసియున్నందున, ఎవరైనా అభ్యంతరములు ఉన్నయెడల 13-9-2024 వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు స్వయంగా గానీ, ప్లీడరు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేనియెడల ఎటువంటి అభ్యంతరాలు లేనట్లుగా తీర్మానించబడును.

ఎస్. గంగిరెడ్డి, యం.ఎ, బి.ఎల్.,
పిటిషనరు తరపు న్యాయవాది
సెల్ : 9440658156

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE: DHONE.
O.S.No. 596/2023.

1.Pannegatlu Mabu shaheb @ Shaik Mabu shaheb S/O Pannegatlu Madar Saheb since died his legal heirs
2. Kashim Bee W/O late Shaik Mabu Shaheb, aged about 76 years, Muslim, House wife, R/O Obulapuram village, Dhone Mandal, Nandyala district.
3. Kaja Bee D/O late Shaik Mabu Shaheb, agedabout 45 years, Muslim House wife, R/O Obulapuram village, Dhone Mandal, Nandyala district.
4. Shaik Rasool Bi D/O late Shaik Mabu Shaheb, aged about 45 years, Muslim, House wife, R/O Obulapuram village, Dhone Mandal, Nandyala district.
5. Shaik Dasthagiri S/O late Shaik Mabu Shaheb, aged about 45 years, Muslim, Cultivation, R/O Obulapuram village, Dhone Mandal, Nandyala district.

...PLAINTIFFS

V/S

Aayyaluru Vankambotla Narasimhaiah S/O Ayyaluru Vankambotla Venkata ramaiah, aged about 74 years, Hindu, Purohitham, R/O Near Prameela Hospital, V.V.Mahal Road, Tirupathi town Chitoor district. ...DEFENDANT

సమను ప్రకటన

పై దావా నందు Plaintiff No 2 to 5 Deceased Plaintiff అయిన Pannegatlu Mabu shaheb S/O Pannegatlu Madar Saheb కి వ్రాయించి ఇచ్చిన Agreement sale ని రిజిష్టర్ చేయమని పై దావాను వేసి యున్నారు. పై దావా 30/09/2024 వాయిదా కలదు. కావున Defendant అయిన మీరు 30/09/2024వ తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు స్వతహాగా కాని Advocate ద్వారా కాని హాజరు కావలయును లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడము జరుగునని తెల్పడము అయినది.

By Court Order
G.Madhusudhana Rao,
Advocate for Plaintiff,
Dhone, Nandyla Dist.
Cell : 9441733503